సాక్షి
నల్లగొండ
సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024



అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 588.70 అడుగులు
ఇన్‌ఫ్లో	: 2,60,366 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 2,18,300 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,948క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,604 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 2,114 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	641.60 అడుగులు
ఇన్‌ఫ్లో	: 3,665 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 2,444 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

నీలగిరి మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్

నల్లగొండ టూటౌన్ : పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఎయిర్ ప్రోగ్రాం కింద నిర్వహించిన స్వచ్ఛ్ వాయు సర్వేక్షణ్–2024లో నల్లగొండ మున్సిపాలిటీ జాతీయస్థాయిలో రెండవ స్థానంలో నిలిచి అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ చేతుల మీదుగా నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అవార్డు, నగదు అందుకున్నారు.

శాస్త్రీయతతోనే ప్రపంచ మనుగడ



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

నల్లగొండ రూరల్ : ప్రపంచ మనుగడ శాస్త్రీయ పరిశోధనపైనే ఆధారపడి ఉందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం నల్లగొండలో జేవీవీ జిల్లా మహాసభల సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానం పెంచుకోవాలంటే పరిశోధనపై దృష్టి సారించాలని, మూఢవిశ్వాసాలు ఇప్పటికీ నమ్మే వారు ఉండటం దురదృష్టకరమన్నారు. జేవీవీ రాష్ట్ర కోశాధికారి వరప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న మూఢ విశ్వాసాలపై జన విజ్ఞాన వేదిక 36 సంవత్సరాలుగా పోరాటం సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి అమరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు సుదర్శన్ రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, చేపూరి సతీష్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం జేవీవీ జిల్లా కమిటీని ఎనుకున్నారు. అధ్యక్షుడిగా గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాఫెల్, కోశాధికారిగా ఉస్మాన్‌అలీతో మరో 15 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు.

రైతుభరోసా వెంటనే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

మునుగోడు : వానాకాలం సీజన్ ముగింపు దశలో ఉందని.. ప్రభుత్వం వెంటనే రైతుభరోసా అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలని అమలు చేసేవరకు పోరాడుతామన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మిర్యాల భరత్ కుమార్, ముత్యాలు, నర్సింహ, అంజయ్య, యాదయ్య, మారయ్య, పుల్కరం అంజయ్య, యాదయ్య, వెంకన్న పాల్గొన్నారు.

సాయుధపోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

నల్లగొండ టౌన్ : భూమి, భుక్తి, విముక్తి నినాదంతో ఆరంభమైన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని నేటి యువత కొనసాగించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన శౌర్యయాత్ర ఆదివారం నల్లగొండకు వచ్చిన సందర్భంగా స్థానిక సుభాష్ విగ్రహం వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పాలకులు నాటి చరిత్రను వక్రీకరిస్తూ మతాల మధ్య తగాదాగా చూపిస్తున్నాయని మండిపడ్డారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు వేముల ఆనంత్ మాట్లాడుతూ ఉద్యమ పల్లెల్లో పోరాటయోధుల సమాధుల్ని సందర్శించేందుకు శౌర్యయాత్ర నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సయ్యద్‌హాషం, చిన్నపాక లక్ష్మీనారాయణ, నాంపల్లి చంద్రమౌళి, కుమ్మరి శంకర్, విజయ, సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి, సత్యనారాయణ, వినోద్‌కుమార్, వెంకన్న, శివచరణ్ పాల్గొన్నారు.

కొలువుదీరిన గణనాథుడు



నల్లగొండలోని రామాలయం వద్ద గణేశ్ పూజల్లో పాల్గొన్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, వివిధ పార్టీ నాయకులు



నల్లగొండలోని సావర్కర్‌నగర్ వినాయక మండపం వద్ద పూజలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

నల్లగొండ రూపు రేఖలు మారుస్తా

- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఉపాధి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : అభివృద్ధి పనులతో ఆరు మాసాల్లో నల్లగొండ రూపు రేఖలు మారుస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండలో వినాయక మండపాలను దర్శించుకుని పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. నల్లగొండ కాలనీల్లో ఉన్న పార్కుల్లో సౌకర్యాలు కల్పించి సుందరీకరిస్తానన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపడతామన్నారు. మంత్రి అయిన తర్వాత నల్లగొండ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.450 కోట్ల నిధులు మంజూరు చేయించానన్నారు. వివిధ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగులు ఉద్యోగం పొందేలా రూ.20 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు వచ్చేలా మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కొత్త కోర్సులు ప్రవేశపడతామన్నారు. తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

పదిహేను రోజులు.. 2.41 లక్షల ఎకరాలు



హాలియా మండలం రామడుగులో వరినాటు వేస్తున్న కూలీలు

జిల్లాలో జోరుగా వరిసాగు

- పక్షం రోజుల క్రితం వరకు 2,00 677 ఎకరాల్లోనే..
- సాగునీటి విడుదల, వర్షాలతో అనూహ్యంగా పెరిగిన సాగు విస్తీర్ణం

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లాలో వరిసాగు జోరందుకుంది. సీజన్ ఆరంభం నుంచి వరిసాగు పనులు మందకొడిగా సాగినప్పటికీ గత 15 రోజులుగా ఊపందుకున్నాయి. సీజన్ ప్రారంభంలో సరైన వర్షాలు లేక నాగార్జునసాగర్ ఎడమ కాలువ, వరద కాలువ, ఏఎంఆర్‌పీకి సాగు నీటి విడుదల చేయలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా నాన్ ఆయకట్టు ప్రాంతంలో కేవలం బోర్ల కింద మాత్రమే 2,00,677 ఎకరాల్లోనే రైతులు వరిపంటను సాగు చేశారు. అయితే గత పదిహేను రోజులుగా కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో వర్షాలు కురడంతో పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు నిండాయి. దీంతో సాగర్ ఎడమ కాలువతో పాటుగా వరద కాలువ, ఏఎంఆర్‌పీ కాలువలకు ప్రభుత్వం సాగునీటిని విడుదల చేసింది. దీనికి తోడుగా గత కొన్ని రోజులుగా జిల్లా అంతటా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా జిల్లాలో ఈ పదిహేను రోజుల్లోనే ఏకంగా 2.41లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగును చేయడం గమనార్హం. దీంతో జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో మొత్తం వరిసాగు 4,41,667 ఎకరాలకు చేరిందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే ఈ సీజన్‌లో జిల్లాలో 5.40 లక్షల ఎకరాల్లో పత్తిపంట అలాగే మొత్తం పంటలను పరిశీలిస్తే 9.87లక్షల ఎకరాల్లో సాగయ్యాయని అధికారులు చెబుతున్నారు.

వెదజల్లే పద్ధతిలోనే ఎక్కువగా సాగు



సాగునీటి విడుదలతో పాటు జిల్లా అంతటా పెద్ద ఎత్తున వర్షాలు కురవడంతో రైతులు స్వల్పకాలిక రకాలను వరి వంగడాలను వెదజల్లే పద్ధతిలో సాగు చేసుకున్నారు. ప్రస్తుతం నానాకాలం సీజన్ వరినాట్ల సమయం ముగిసినట్లే.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ, నల్లగొండ

ఎక్కువగా స్వల్పకాలిక రకాలే సాగు

వానాకాలంలో సీజన్ ముగుస్తున్న నేపథ్యంలో సాగు నీటి విడుదల, వర్షాలు కురుస్తుండంతో నార్లు పోసుకునే సమయం లేకపోవడంతో రైతులు ఎక్కువగా స్వల్పకాలిక రకాల వరిని వెదజల్లే పద్ధతిలో సాగు చేసుకున్నారు. 120 రోజుల్లోనే చేతికి వచ్చే స్వల్పకాలిక రకాలైన సిరి–101, పద్మా, అంకుర్, చిట్టిపొట్టి, కావేరి టిల్లు, మహేంద్ర 55, కావేరి ఎక్స్‌ప్రెస్ వంటి వరి వంగడాలను సాగు చేసుకున్నారు.

పంటల సాగు ఇలా.. (ఎకరాలలో..)

పంట	గతనెల 22 వరకు	ఇప్పటి వరకు
పత్తి	5,30,439	5,40,040
వరి	2,00,677	4,41,667
కంది	2,479	2,479
జొన్న	227	227
ఇతరాలు	2,692	2,692
మొత్తం	7,36,514	9,87,105

మదర్ డెయిరీ పోరు రసవత్తరం

- ఆరు డైరెక్టర్ల స్థానాలకు 12 మంది పోటీ
- కాంగ్రెస్, బీఆర్ఎస్ హోరాహోరీ
- చైర్మన్లను క్యాంపునకు తరలించే యోచనలో కాంగ్రెస్



సాక్షి, యాదాద్రి : మదర్ డెయిరీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఉమ్మడి నల్లగొండ – రంగారెడ్డి జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న మదర్ డెయిరీలో ఆరు డైరక్టర్ల స్థానాలకు ఈనెల 13న ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 12మంది పోటీలో ఉన్నారు. 297 మంది పాల సొసైటీ చైర్మన్‌లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాలుగు డైరెక్టర్ స్థానాలకు 8, రంగారెడ్డి జిల్లాలోని రెండు డైరెక్టర్ల స్థానాలకు నలుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు.

ఆలేరు కేంద్రంగా డెయిరీ రాజకీయం..

ఆలేరు కేంద్రంగా మదర్ డెయిరీ రాజకీయం నడుస్తోంది. శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసేసరికి ఆరు డైరెక్టర్ల స్థానాలకు గాను 12 మంది పోటీలో మిగిలారు. కాగా బీఆర్ఎస్ చేతిలో ఉన్న మదర్‌డెయిరీని హస్తగతం చేసుకోవడానికి కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. డైరెక్టర్ స్థానాలకు ఉమ్మడి నల్లగొండ నుంచి 8 మంది పోటీపడుతుండగా అందరూ ఆలేరు నియోజకవర్గానికి చెందిన వారే కావడం గమనార్హం. ఇందులో కాంగ్రెస్ నుంచి గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, పుప్పాల నర్సింహులు, బత్తుల నరేందర్‌రెడ్డి, కల్లెపల్లి శ్రీశైలం.. బీఆర్ఎస్ తరఫున సందిల భాస్కర్, ఎం.కొండల్‌రెడ్డి, ఒగ్గు భిక్షపతి, డి.సామిరెడ్డి బరిలో నిలిచారు. రంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకుంది. కాంగ్రెస్‌లో సమన్వయం కుదరకపోవడంతో ఏ.నర్సింహారెడ్డి, ఎం.జంగయ్య, ఏ.రాంరెడ్డి, పి.గణేష్ రంగంలో దిగారు.

ఒక్క ఓటరు ఆరు ఓట్లు వేయాలి

297 మంది పాలసొసైటీ చైర్మన్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఒక్కొక్కరు ఎవరైనా ఆరుగురికి మాత్రమే ఓట్లు వేయాలి. ఎనిమిది మంది పోటీలో ఉన్న బ్యాలెట్‌లో నాలుగు, నలుగురు పోటీలో ఉన్న బ్యాలెట్‌లో 2 ఓట్లు వేయాలి. అత్యధిక ఓట్లు వచ్చిన వారిని డైరెక్టర్లుగా ప్రకటిస్తారు.

14న చైర్మన్ ఎన్నిక

చైర్మన్ ఎన్నికను ఈనెల 14వ తేదీన నిర్వహించనున్నారు. ఇప్పటికే ఉన్న 9 మంది డైరక్టర్లతో పాటు ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో గెలిచిన ఆరుగురు డైరెక్టర్లతో కలిసి పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేసి ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ప్రస్తుత చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి పదవీకాలం ముగియడంతో ఆయన తిరిగిపోటీ చేయడంలేదు. దీంతో చైర్మన్ పదవిని కైవసం చేసుకోవడానికి కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఓటర్లను ఒకటి, రెండురోజుల్లో క్యాంపునకు తరలించే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

తాడువాయిలో వరద కాలువకు గండి

- 70 ఎకరాల్లో నీట మునిగిన పొలాలు



వరద కాలువకు గండిపడిన ప్రాంతం

మునగాల: మండలంలోని తాడువాయి శివారులో గల గండిమైసమ్మ గుడి వద్ద ఎర్రచెరువు అలుగుకు అనుబంధంగా ఉన్న వరద కాలువకు ఆదివారం గండి పడింది. దీంతో సుమారు 70ఎకరాల్లో వరిపొలాలు నీట మునిగాయి. ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ఎర్రచెరువుకు మూడు రోజులుగా అలుగు పోస్తుంది. దీంతో అలుగు నుంచి వచ్చే నీరు వరద కాలువ గుండా ఒక్కసారిగా రావడంతో తాడువాయి శివారులో గండిపడి వరదంతా వరిపొలాలపై పడింది. వరద ఎక్కువగా వస్తుందని, మరిన్ని పొలాలు మునిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖకు అధికారులు తక్షణమే గండిని పూడ్చాలని వరద కాలువ కింద వరిసాగుచేసిన రైతులు కోరుతున్నారు.

వైభవంగా స్వాతి నక్షత్ర పూజలు

యాదగిరిగుట్ట : నృసింహుడి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా యాదాద్రి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు విశేష రీతిలో కొనసాగాయి. వేకువజామున ఆలయంలో, వైకుంఠద్వారం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు చేసి గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. అనంతరం మెట్లమార్గంలో వెళ్లి శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. ఇక ప్రధాలయ ముఖమండపంలో అర్చకులు స్వాతి హోమం, శ్రీస్వామి, అమ్మవార్లకు శతఘటాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకల్లో దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

నష్టాన్ని జగ్రత్తగా అంచనా వేయాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్




దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న అనితా రామచంద్రన్, కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : భారీ వర్షాలు, వరదలతో జరిగిన నష్టం అంచనాలను జాగ్రత్తగా రూపొందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆమె నల్లగొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి వర్షాల కారణంగా జరిగిన నష్టం అంచనాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి మాట్లాడారు. భారీ వర్షాల ప్రభావిత జిల్లాల్లో నల్లగొండ ఉందన్నారు. ఫొటోలు, ఆధారాలు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో సహా నష్టం అంచనా వివరాలు సమర్పించాలన్నారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలు, మత్స్య సంపద, చెరువులు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులు, తాగునీటి వనరులు, విద్యుత్‌తోపాటు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల భవనాలు, ఇతర ప్రభుత్వ భవనాలు దెబ్బతిన్నా.. పడిపోయినా పూర్తి వివరాలను నిర్దేశించిన ప్రొఫార్మలో సమర్పించాలని సూచించారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఇటీవల వర్షాలు, వరదల వల్ల ఆయా సెక్టార్ల వారీగా జరిగిన నష్టాన్ని అంకెలు, ఫొటోలతో సహా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భువనగిరి జిల్లాలో జరిగిన నష్టాన్ని ఆ జిల్లా అదనపు కలెక్టర్లు గంగాధర్, పి.బెన్‌సలోన్‌తో సమీక్షించారు. అనతరం ఆమె.. కలెక్టర్ నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్లతో కలిసి కేతేపల్లి నుంచి కాసనగోడు వెళ్లే రోడ్డును పరిశీలించారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, నల్లగొండ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీఓ రవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్‌లో దొంగలు

- రూ.కోట్లు విలువ చేసే సామగ్రి మాయం
- యథేచ్ఛగా స్క్రాప్ చోరీ
- అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ఆరోపణలు
- నిందితులపై నామమాత్రపు కేసులు పెడుతున్న పోలీసులు



యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద విలువైన సామగ్రి

మిర్యాలగూడ : యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో దొంగలు పడుతున్నారు. వందల కోట్ల రూపాయల విలువైన ఇనుము, అల్యూమినియం, కాపర్‌తోపాటు ఇతర స్క్రాప్‌ను మాయం చేస్తున్నారు. 2017లో పవర్‌ప్లాంట్ పనులు ప్రారంభమైన నాటి నుంచే దొంగతనాలు జరుగుతున్నాయి. దొరికినప్పుడు నిందితులపై నామమాత్రపు కేసులు నమోదు చేసి వదిలి పెడుతుండడంతో ఇప్పుడు పెద్ద ఎత్తున చోరీలు జరుగుతున్నాయి. ఇదంతా గోడౌన్ ఇన్‌చార్జిగా ఉన్న ఓ గెజిటెడ్ అధికారి, సెక్యూరిటీ సిబ్బంది కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. పట్టుబడిన నిందితులు పోలీసు అధికారులకు లక్షలాది రూపాయల ముడుపులు అందజేయడంతోపాటు రాజకీయ అండదండలను ఉపయోగించుకుని యథేచ్ఛగా ఈ దందా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పోలీసుల అదుపులో ఏడుగురు..

ఈ ఏడాది మే నెలలో కొందరు దొంగల ముఠా యాదాద్రి పవర్‌ప్లాంట్ సెక్యూరిటీ గార్డుకు భారీ ఎత్తున ముడుపులు అందజేసి సుమారు రూ.10 కోట్ల విలువైన స్క్రాప్‌ను టాటా ఏస్ వాహనాల్లో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితులపై నామమాత్రపు కేసు నమోదు చేసి వదిలేశారు. ఈ నెల 8వ తేదీన శనివారం సాయంత్రం వీర్లపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు స్క్రాప్‌ను ఆటోలో తరలిస్తుండగా.. పవర్‌ప్లాంట్ సమీపంలో పోలీసులు పట్టుకుని విచారించారు. వారు దామరచర్ల మండలంలోని సాత్‌తండాకు చెందిన మరో ముగ్గురి పేర్లు చెప్పారు. దీంతో వారిని కూడా పట్టుకుని విచారించగా.. మిర్యాలగూడ సమీపంలో పాత ఇనుప సామాను దుకాణంలో స్క్రాప్ అమ్మినట్లు వెల్లడించారు. దీంతో సదరు దుకాణానికి చెందిన మహిళను అదుపులోకి తీసుకుని విచారించగా.. నిందితులు నిత్యం స్క్రాప్ అమ్ముతున్నట్లు తెలిపింది. ఈ ఏడుగురు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారిస్తే రూ.కోట్ల విలువైన స్క్రాప్ స్కాం బయటపడే అవకాశం ఉంది.

దొంగతనాలు ఇలా..

ముఠా సభ్యులు మొదట పవర్‌ప్లాంట్ సెక్యూరిటీ గార్డ్‌కు భారీ మొత్తంలో ముడుపులు అందిస్తారు. కూలీలను ఎంచుకుని వారిని ఒక ఆటోలో పవర్ ప్లాంట్ లోపలికి తీసుకెళ్లి స్క్రాప్‌ను ఆటోలు, టాటా ఏస్ వాహనాల్లో ఎక్కించి తీసుకొస్తారు. ఇలా తీసుకొచ్చిన స్క్రాప్‌ను లారీల్లో లోడ్ చేసి దామరచర్ల సమీపంలో అప్పటికే సిద్ధంగా ఉన్న లారీల్లో లోడ్ చేసి హైదరాబాద్ తరలించి కోట్ల రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. కొద్ది మొత్తంలో అయితే సమీపంలోని మిర్యాలగూడలో విక్రయిస్తున్నారని తెలుస్తోంది. లారీలకులారీలే స్క్రాప్ మాయం చేస్తున్నా.. అధికారులు, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా పవర్‌ప్లాంట్‌లో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

భారీగా పోలీస్ పహారా..

యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో నిత్యం పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటుంది. డీఎస్పీ స్థాయి అధికారి, సీఐ, ఎస్ఐతోపాటు మరో 40 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది నిత్యం పహారాలో కాస్తుంటారు. అయినప్పటికీ పవర్‌ప్లాంట్‌లో ఉన్న స్క్రాప్ మాయమవుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. సంస్థలో పనిచేస్తున్న ఇంజనీర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులు సైతం స్క్రాప్‌ను దొంగలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా పవర్‌ప్లాంట్‌లో సుమారు వంద కోట్ల రూపాయల విలువైన స్క్రాప్ చోరీకి గురవుతుంటే.. భద్రతా సిబ్బంది ఏం చేస్తున్నారనేది వెయ్యి డాలర్ల ప్రశ్నగా మిగులుతోంది.

క్లుప్తంగా

పాముకాటుతో రైతు మృతి


మోటె నర్సింహ (ఫైల్)

రామన్నపేట: పాముకాటుతో రైతు మృతిచెందాడు. ఈ ఘటన శనివారం రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లంకి గ్రామానికి చెందిన మోటె నర్సింహ(55) వ్యవసాయంతో పాటు చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం పొలం గట్ల మీదుగా వెళ్లి వ్యవసాయ మోటారు ఆన్ చేసి ఇంటికి వచ్చాడు. కొద్దిసేపటికే అస్వస్థతకు గురయ్యాడు. స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీ వచ్చి పరీక్షించేలోగా మృతిచెందాడు. నర్సింహ మృతదేహాన్ని పరిశీలించగా కుడికాలుతో పాటు పెద్ద వేలు పసుపురంగులోకి మారడంతో పాము కరిచినట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతుడి కుమారుడు విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


పరశురాములు (ఫైల్)

ఆలేరురూరల్: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆలేరు బైపాస్ రోడ్డులో శనివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామానికి చెందిన చెక్కిళ్ల పరశురాములు(63) తన వృత్తిలో భాగంగా శనివారం సాయంత్రం కందిగడ్డతండా సమీపంలోని త్రిబుల్ ఆర్ హోటల్ వద్ద తాటిచెట్టు ఎక్కేందుకు వెళ్తూ.. బైపాస్ రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పరశురాములు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రజనీకర్ తెలిపారు.

భారీ కొండచిలువ ప్రత్యక్షం

- భయంతో కొట్టి చంపిన రైతులు


కొండచిలువను కొట్టి చంపిన రైతులు

మోత్కూరు: మండలంలోని ముశిపట్ల గ్రామానికి చెందిన రైతు చేబెల్లి అయిలయ్య పొలంలో శనివారం భారీ కొండ చిలువ ప్రత్యక్షమైంది. అయిలయ్య తన పొలంలో వరికోత మిషన్‌లో వరి కోయిస్తుండగా.. ఆరు అడుగుల పొడవు ఉన్న కొండచిలువ బయటకు వచ్చింది. అక్కడే ఉన్న పలువురు రైతులు కర్రలతో కొండచిలువను కొట్టి చంపారు.

గొర్రెల దొంగల అరెస్ట్

భువనగిరి క్రైం: మండలంలోని హన్మాపురం గ్రామంలో ఈ నెల 5వ తేదీన తోటకూరి చంద్రయ్యకు చెందిన 15 గొర్రెలను దొంగిలించిన నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని రామాంతాపూర్‌కు చెందిన రాయపురం నరేష్, దేవరాయ నరేష్, రుద్రాక్షల కాంతయ్య టాటా ఏస్ వాహనంలో హన్మాపురం గ్రామానికి చేరుకుని తోటకూరి చంద్రయ్యకు చెందిన 15 గొర్రెలను ఎత్తుకెళ్లారు. నిందితుల నుంచి రూ.29,000, టాటా ఏస్ వాహనం స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మట్టి గణపయ్యలు..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా సాక్షి దినపత్రిక చేపట్టిన 'సెల్ఫీ విత్ గణేశా..' క్యాంపెయిన్‌కు విశేష స్పందన లభించింది. కొందరు తమ ఇళ్లలో, వీధుల్లో మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వాటిల్లో కొన్ని ఫొటోలు..


మట్టి గణపతితో టి. లోహిత, తుంగతుర్తి


చౌటుప్పల్: విద్యానగర్ కాలనీలో ఎద్దుల బండిపై ఉన్న గణనాథుడిని ప్రతిష్ఠించిన చిన్నారులు


వలిగొండలో మట్టి గణపతిని పూజిస్తున్న చిన్నారులు


మట్టి గణపతిని పూజిస్తున్న ఎ. అన్విత, మిర్యాలగూడ



ఇరువంటి శ్రీదేవి, లాస్య, వట్టిఖమ్మంపహాడ్


కంచర్ల మైథిలి, దేవరకొండ


భువనగిరిలో రూపాయి నాణేలతో తయారుచేసిన గణనాథుడు


సామ శ్రీనిజ, క్రిష్ణానగర్, సూర్యాపేట


కె. సింధు, దేవరకొండ


కార్తికేయ, సూర్యాపేట


మహిత, చిట్యాల


టి.నాగార్జున, మిర్యాలగూడ


సూర్యాపేటలోని విద్యానగర్‌లో మట్టి గణపతిని పూజిస్తున్న భక్తులు


కె. మానస, నెమ్మాని, నార్కట్‌పల్లి మండలం

క్వారీ గుంతలో మునిగి వ్యక్తి గల్లంతు

- రెండురోజులుగా వెతుకుతున్నా లభించని ఆచూకీ


హీరా (ఫైల్)

అత్మకూర్ (సూర్యాపేట): మండల పరిధిలోని బొప్పారం గ్రామంలో గల క్వారీ గుంతలో మునిగి వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం కూడలితండాకు చెందిన బుక్య బిచ్యా బొప్పారంలో భూమి కౌలుకు తీసుకున్నాడు. ఈ భూమికి సమీపంలోనే క్వారీ గుంత ఉండగా అక్కడి నుంచి వ్యవసాయ భూమికి నీటిని తీసుకొచ్చేందుకు అందులో విద్యుత్ మోటారును బిగించాడు. ఇటీవల కురిసిన వర్షాలకు క్వారీ గుంతలో భారీగా నీరు చేరడంతో విద్యుత్ మోటారు నీటిలో మునిగిపోయింది. విద్యుత్ మోటారును బయటకు తీసేందుకు శనివారం కూడలితండాకే చెందిన బానోతు హీరా(51)ను బిచ్యా కూలీకి తీసుకొచ్చాడు. క్వారీ గుంతలో ఉన్న మోటారును తీసేందుకు నీళ్లలోకి వెళ్లిన హీరా మోటారుకు తాడుకట్టగా బయట ఉన్న వారు మోటారును బయటకు తీశారు. అయితే నీళ్లలోకి వెళ్లిన హీరా ఎంతకూ బయటకు రాకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సైదులు ఘటనా స్థలానికి చేరుకుని ఎవరైనా క్వారీ గుంతలోకి వెళ్లి చూడాలని కోరగా.. ఎవరూ ముందుకు రాలేదు. హీరా గల్లంతవ్వడానికి బిచ్యానే కారణమంటూ కొందరు అతడిపై దాడికి పాల్పడ్డారు.


క్వారీ గుంతలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

గజ ఈతగాళ్లు వచ్చినా...!

హీరా ఆచూకీ ఆదివారం ఉదయం వరకు లభించకపోవడంతో పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించారు. వారితో పాటు సీసీ కెమెరాల సాయంతో వెతికినా హీరా ఆచూకీ లభించలేదు. చివరకు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని నీటిని బయటకు తోడి హీరా ఆచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ రాత్రి వరకు కూడా ఆచూకీ లభించలేదు. ఘటనా స్థలాన్ని సూర్యాపేట డీఎస్పీ రవి, రూరల్ సీఐ సురేందర్ పరిశీలించారు.

ఇదే క్వారీలో గతంలో ముగ్గురి మృత్యువాత..

కాగా ఇదే క్వారీలో జూలై 17వ తేదీన ఈతకు వెళ్లి ముగ్గురు మృత్యువాత పడ్డారు. హైదరాబాద్‌లో నివాసముండే ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన తిప్పారెడ్డి శ్రీపాల్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా నర్సరావుపేటకు చెందిన చామలి రాజు, అతడి కుమార్తె ఉషాంక తమ బంధువుల ఇంటికి వచ్చి.. ఈత కోసం ఇదే క్వారీలోకి వెళ్లి అందులో మునిగి మృతిచెందారు.

ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగల అరెస్ట్

- రూ.10లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

నల్లగొండ క్రైం: ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆదివారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలంకొండపల్లి గ్రామానికి చెందిన ఇట్ల గోపినాథ్ అలియాస్ గోపి అలియాస్ లక్కి హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. అతడితో పాటు ఎన్టీఆర్ కృష్ణా జిల్లా వత్సవాయి మండలం ఒంగోలు గ్రామానికి చెందిన సిమ్మ సత్తి గోపిక్రిష్ణ అలియాస్ గోపి కలిసి రెండు తెలుగు రాష్ట్రాల్లో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడ్డారు. వీరు గతంలో జైలుకు వెళ్లి విడుదలయ్యారు. ఇటీవల సూర్యాపేట జిల్లాలో చోరీ చేసిన సొత్తును విజయవాడలో అమ్మేందుకు బయల్దేరారు. మార్గమధ్యలో కేతేపల్లిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు వీరు అనుమానాస్పదంగా కనిపించడంతో ఫింగర్ ప్రింట్స్ తీసుకోగా.. వారిపై పలు కేసులు ఉన్నట్లు తేలింది. వారి వెంట ఉన్న బ్యాగును పరిశీలించగా అందులో రూ.10లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు లభించినట్లు డీఎస్పీ తెలిపారు. ఆభరణాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ్, క్రైం పార్టీ సిబ్బంది అజిత్‌రెడ్డి, రాంబాబుకు డీఎస్పీ రివార్డు అందజేసి అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

తుడిమిడిలో విషాదఛాయలు

- ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామ వాసి మృతి
- స్వగ్రామంలో పూర్తయిన అంత్యక్రియలు

శాలిగౌరారం: మండలంలోని తుడిమిడి గ్రామానికి చెందిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఏపీలోని శ్రీకాకుళం జిల్లా సోంపేట డివిజన్‌లో రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తుడిమిడి గ్రామానికి చెందిన బండారు సత్యనారాయణ(38) ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ అగ్రోఇకాలజి రీసెర్చ్ అండ్ లెర్నింగ్(ఐజీజీఏఏఆర్‌ఎల్)లో 2018లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా చేరాడు. ప్రస్తుతం ఏపీలోని శ్రీకాకుళం జిల్లా సోంపేట డివిజన్ మెంటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం నుంచి ఒడిశా రాష్ట్రంలోని బరంపుర పట్టణానికి బైక్‌పై వెళ్తుండగా.. ఆంధ్ర–ఒడిశాసరిహద్దులో గుర్తుతెలియని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ రెండు కాళ్లు విరిగిపోయాయి. స్థానికులు అంబులెన్స్‌లో ఒడిశా రాష్ట్రంలోని బరంపూర మెడికల్ కళాశాలకు చెందిన హాస్పిటల్‌కు తరలించారు. అక్కడకు వెళ్లిన తర్వాత స్పృహలోకి వచ్చిన సత్యనారాయణ జరిగిన విషయాన్ని తన సహచరులకు, కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. సహచరులు వెంటనే అక్కడ నుంచి సత్యనారాయణను మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తీసుకెళ్తుండగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళంలోని మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. మెడికవర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 6వ తేదీన మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్యనారాయణ అంత్యక్రియలు శనివారం సాయంత్రం తుడిమిడి గ్రామంలో జరిగాయి.


సత్యనారాయణ (ఫైల్)

నివాళులర్పించిన ఎమ్మెల్యే..

సత్యనారాయణ మృతదేహానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శనివారం నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి తదితరులు ఉన్నారు.

నెట్‌బాల్ నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులు నవ్యశ్రీ, మైనా

మోటకొండూర్: జూనియర్ మిక్స్‌డ్ నెట్‌బాల్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు మోటకొండూర్ మండలం చాడ గ్రామానికి చెందిన విద్యార్థినులు వంగపల్లి నవ్యశ్రీ,, పంగ మైనా ఎంపికైయ్యారు. వీరు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో సెకండియర్ చదువుతున్నారు. వీరికి గతంలో కూడా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చినా ఆర్థిక ఇబ్బందుల కారణంగా హాజరుకాలేదు. ప్రభుత్వం, దాతలు సహకరించాలని వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

శిశువు మృతికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ..

- దేవరకొండ ప్రధాన రహదారిపై బంధువులు, కుటుంబ సభ్యుల రాస్తారోకో

దేవరకొండ: శిశువు మృతికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ శిశువు బంధువులు, తల్లిదండ్రులు దేవరకొండ ప్రధాన రహదారిపై ఆదివారం రాస్తారోకో చేపట్టారు. డిండి మండలం ఎర్రారం సోమ్లాతండాకు చెందిన ఇస్లావత్ రమేష్, జ్యోతి దంపతులకు ఒక కుమార్తె ఉండగా.. ఈ నెల 3వ తేదీన దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో జ్యోతి రెండో కాన్పులో మగ బిడ్డకు జన్మనిచ్చింది. శిశువుకు కామెర్లు ఉండడంతో ఆస్పత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. కాగా ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించే వైద్యుడు బాబురాం పట్టణంలోని తాను నిర్వహిస్తున్న న్యూ రెయిన్‌బో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురావాలని సూచించడంతో రమేష్ దంపతులు శిశువును శనివారం అక్కడ అడ్మిట్ చేశారు. శనివారం రాత్రి శిశువు పరిస్థితి విషమంగా ఉండడంతో సదరు డాక్టర్‌కు ఫోన్‌లో సమాచారం అందించేందుకు ప్రయత్నించగా అతడు స్పందించలేదు. ఆదివారం ఉదయం ఆస్పత్రికి వచ్చిన డాక్టర్ శిశువుకు చికిత్స అందించగా కొద్దిసేపటికే శిశువు మృతిచెందాడు. కాగా శిశువు మృతికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రిలోని ఫర్నీచర్ ధ్వంసం చేశారు. అనంతరం దేవరకొండ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న దేవరకొండ సీఐ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని శిశువు బంధువులకు సర్దిచెప్పడంతో వారు శాంతించారు. సదరు వైద్యుడిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.


శిశువు మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బంధువులు, కుటుంబ సభ్యులు

జాతీయ పోటీలకు ఎంపిక


జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నల్లగొండ టూటౌన్: పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో ఈ నెల 16న జరుగనున్న ఆలిండియా హాకీ జూనియర్ జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు నల్లగొండ పట్టణంలోని పెద్దబండకు చెందిన సింగం మధు, రావుల గణేష్ ఎంపికయ్యారు. వీరిద్దరు గత నెలలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి సెలక్షన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి తెలంగాణ జట్టుకు ఎంపికయ్యారు. మధు, గణేష్‌కు హాకీ అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కూతురు శ్రీనివాస్‌రెడ్డి, ఇమామ్ కరీం, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల కార్యదర్శులు శ్రీనివాసులు, లింగయ్యయాదవ్ అభినందనలు తెలియజేశారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న చిట్యాల పట్టణ శివారులో కారు దగ్ధమైంది. ఈ ఘటన ఆదివారం జరిగింది. చిట్యాల ఎస్‌ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లికి చెందిన మైనంపాటి శంకర్‌రెడ్డి, మరో వ్యక్తి కలిసి నార్కట్‌పల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో చిట్యాల పట్టణ శివారులోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే కారు ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. వెంటనే కారును రహదారిపైనే నిలిపి వేసి శంకర్‌రెడ్డి, మరో వ్యక్తి కిందకు దిగారు. ఒకవైపు వర్షం వస్తున్నప్పటికీ కారుకు అంటుకున్న మంటలు మండుతూనే ఉన్నాయి. దీంతో రామన్నపేట ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. బాధితుడు శంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


దగ్ధమవుతున్న కారు

పులిచింతలకు పెరిగిన ఇన్‌ఫ్లో

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగింది. ఆదివారం ఎగువన సాగర్, టెయిల్‌పాండ్ నుంచి 2.56 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టులోని 8 క్రస్ట్ గేట్లను ఎత్తి 1.87 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 39.59 టీఎంసీల నీరు ఉంది. పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కో పవర్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. 16 వేల క్యూసెక్కుల నీటితో నాలుగు యూనిట్ల ద్వారా 90 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

సూపర్ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

చౌటుప్పల్: పట్టణ కేంద్రలోని వలిగొండ రోడ్డులో గల చంద్ర సూపర్ మార్కెట్‌లో శనివారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు దుకాణ యజమానితో పాటు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్‌సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో కొంతమేరకు సామగ్రి దగ్ధమైంది. షార్ట్‌సర్క్యూట్‌తోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

గుర్రంపోడు: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్‌ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన మారం మాధవులు(45) రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆగస్టు 31న కడుపునొప్పి భరించలేక అతడు పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి హైదరాబాద్‌కు తరలించగా అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య మారం పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

మోతె: మండలంలోని హుస్సేన్‌బాద్ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పిడుగు పడి ఆవు మృతి చెందింది. హుస్సేన్‌బాద్ గ్రామానికి చెందిన రైతు కట్కూరి సురేందర్‌రెడ్డి తన ఇంటి వెనక పశువుల కొట్టంలో శనివారం రాత్రి పశువులను కట్టేశాడు. ఆదివారం తెల్లవారుజామున ఉదయం 5గంటలకు లేచి పశువుల కొట్టంలోకి వెళ్లి పశువులను చూడగా ఆవు మృతిచెంది ఉంది. రాత్రి పిడుగు పడి ఆవు మృతిచెందినట్లు రైతు భావిస్తున్నాడు.

ఏఎమ్మార్పీ కాలువలో పడి వ్యక్తి గల్లంతు

పెద్దఅడిశర్లపల్లి: చేపల వేటకు వెళ్లి ఏఎమ్మార్పీ కాలువలో జారిపడి వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణానికి చెందిన మహ్మద్ జుబైర్(47) తన స్నేహితుడు హారిఫ్‌తో కలిసి పెద్దఅడిశర్లపల్లి మండలంలోని ఏకేబీఆర్ ప్రధాన గేటు వద్ద గల కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లి గాలం వేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో జారిపడ్డాడు. నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. పక్కనే ఉన్న హారిఫ్ పోలీసులకు సమాచారం అందించగా గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని ఏఎమ్మార్పీ అధికారులతో మాట్లాడి ఏకేబీఆర్ ప్రధాన గేట్లను మూసివేయించి గాలింపు చర్యలు చేపడుతున్నారు.

ధర్మపురి ఆలయానికి తలంబ్రాలు అందజేత


తలంబ్రాలను అందజేస్తున్న గేయవర్షిణి

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడలోని రెడ్డికాలనీకి చెందిన గుంటూరు శ్రీనివాస్–శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె గేయవర్షిణి 11,116 బియ్యపు గింజలపై శ్రీలక్ష్మీనర్సింహస్వామి నామాలను రాసి జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ అధికారులకు ఆదివారం అందజేశారు. ఈ తలంబ్రాలను స్వామివారి కల్యాణంలో ఉపయోగించారు.